
ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

నటీనట్లు - టెక్నీషియన్లు ఇరువురికి పరస్పర సహకారం అవసరమా?

శ్రీ యం. లింగమూర్తి

(తెలుగు టాకీ 1944 జనవరి సంచిక నుంచి)

టెక్నీషియన్లపై నేనేమీ నేరారోపణ చెయ్యటంలేదని ముందుగా చెప్పదలచుకున్నాను. చిత్రాన్ని సాధ్యమైనంతవరకూ విజయవంతంగా నిర్మించడానికి సినిమా టెక్నీషియన్ల సహాయాన్ని సంఘీభావాన్ని గురించి సినీ ఆర్టిస్టు అయిన నేను నా ఉద్దేశాల్ని మీకు విశదీకరించదలచుకున్నాను.

టెక్నీషియన్లంతా అంటే ఎవరో నాకు తెలియదు కానీ నేను చెప్పదలచుకున్న టెక్నీషియన్లు ఎవరంటే కెమెరామేన్, రికార్డిస్టు వారి అసిస్టెంట్లు. స్క్రిప్టులో ఉన్న గాధని ఫిలిం మీదకి చక్కగా తర్జుమా చెయ్యటానికి డైరక్టరు, ఆర్టిస్టులు, పైన చెప్పిన టెక్నీషియన్లు బాధ్యులు. ఫిలింమీద కావలసిన సరియైన ఎఫెక్టుని తీసుకురావడానికి మనమంతా నటిస్తాము. మనం అనడంలో నా అర్థానికి మీరు ఆశ్చర్యపడొచ్చు.

ఒక షాట్ తియ్యడానికి కెమేరాని నిలబెట్టే ముందు ఏ స్థలాన్ని ఏ సన్నివేశాన్ని కెమేరా తియ్యాలీ, ఏ భావాన్ని కెమేరా ప్రదర్శించాలీ అన్న విషయాల్ని గురించి డైరెక్టరు, కెమేరామేన్ ఇద్దరూ ఒక నిర్ధారణకి వస్తారు. అదిఒక టాకీషాట్ అయితే సరే మైక్‌కి తగు ప్రాముఖ్యతని ఇస్తారు. కావలసిన ఎఫెక్టును తీసుకురావడానికి షాట్ ప్రారంభం మొదలు పూర్తయే వరకూ అంతా కార్యాన్నంతటినీ ఒకే ఉద్దేశంతో నడిపిస్తారు. షాట్ యొక్క అర్థాన్ని, చిత్రంలో దాని స్థానాన్ని డైరక్టరు నటీనటులకి బోధిస్తాడు. దీనివల్ల నటీనటులకి ఎలాంటి నటనని ప్రదర్శించాలో అర్థమౌతుంది. నటిస్తాడు. తర్వాత డైరక్టరు బాగోగుల్ని విమర్శిస్తాడు. ఆ నటనా ప్రదర్శనం సరిగ్గా ఉందో లేదో ఆలోచిస్తాడు. రీహార్సలయిన వెంటనే

నటీనటులు డైరక్టరు ఏ భావాన్ని కలిగి ఉన్నాడో గ్రహిస్తారు. నటనలోని మంచి చెడ్డల్ని ప్రదర్శనా విధానంలో బాగోగులు డైరక్టరు సామార్థ్యం మీద నటీనటులకు సరిగ్గా బోధించడంలోనూ ఆధారపడి ఉంది.

రిహార్సల్ జరుగుతూన్నంతసేపూ కెమేరామేన్, రికార్డిస్టు నటీనటుల పోకడల్ని సంభాషణలోని హెచ్చు తగ్గు స్వరాల్ని నిశితంగా పరీక్షిస్తూంటారు. తర్వాత కెమెరా, మైక్‌లు ఏ స్థానాల్లో ఉంచాలో ఒక నిర్ణయానికి వస్తారు. టెక్నీషియన్లు శ్రద్ధాభక్తుల్తో ఉన్ననాడే నటీనటులకి సహకారంగా ఉండగలుగుతారు. ఈ రిహార్సల్స్‌ని చులకనగా హేళనగా తీసుకుంటే నటీనటులు నిరుత్సాహపడతారు. ఒక్కొక్కప్పుడు దురదృష్టవశాత్తు రిహార్సల్ సమయాల్లో సెట్‌మీద ఒక్క టెక్నీషియనేనా ఉండకపోవడం కద్దు. కెమెరామేన్ ఏ చెట్టుకిందో నిలబడి సిగరెట్‌తో కాలక్షేపం చేస్తూంటాడు. రికార్డిస్టు ట్రక్‌లోని సోమరిపోతులతో జల్సాగా హస్క్ కొడుతూంటాడు. రిహార్సల్ అయిన తర్వాత కెమెరామెన్ ఏడీ? రికార్డిస్ట్ ఎక్కడ? అని వెతకడం మొదలెడ్తారు. హడావుడిగా పరిగెత్తుకుంటూ వస్తూ "ఏం సార్. మేం రెడీగా ఉన్నాం" అంటారు. కోపం కూడా వస్తుంది ఒక్కొక్కరికి పనంటే వీరు ఇలాంటి అశ్రద్ధ చూపుతూంటే నటీనటులకి హెచ్చరికగా ఉండదు. అదీగాకుండా మంచి ప్రదర్శనకి సాధ్యంకాదు.

టెక్నీషియన్లు సెట్‌మీద శ్రద్ధగా పనిచెయ్యడమే కాకుండా షాట్ యొక్క ఉద్దేశ్యానికి సహాయపడుతూండాలి. విషాదఘట్టాన్నిగాని, 'సీరియస్'గా వుండే దృశ్యాన్ని తీసేటఒప్పుడు టెక్నీషియన్లును నవ్వించే కారణం ఆర్టిస్టుల్లోనో లేకపోతే సెట్ మీదున్న పరిసరాల్లోనో ఎక్కడో వుంటేదాన్ని వెంటనే బహిరంగంగా చెప్పెయ్యాలి. లేకపోతే వాళ్ళని చూసి మిగతా వాళ్ళకి కూడా నవ్వొస్తుంది. ఆర్టిస్టు సీరియస్‌నెస్ కుంటుపడుతుంది. ఆర్టిస్ట్ చాలా సున్నితమైన జీవి. ఈ టెక్నీషియన్ల నవ్వుల్ని చూసి తన నటనని చూసి నవ్వుతున్నారేమోనని భ్రమపడి బేజారైపోయి నటించలేకపోతాడు. ఇది సెట్‌మీద చాలా ప్రమాదమైన విషయాల్లో ఒకటి. ఆ నవ్వు ఆనాటి హంగామానంతటినీ ధ్వంసం చేసేస్తుంది. అంచేత టెక్నిషియన్లు అలాంటి లోపాలు కనిపెట్టినప్పుడు వెంటనే దాన్ని బహిరంగంగా చెప్పెయ్యాలి లేదా మిగిలినవాళ్ళకి తెలియచెయ్యకుండా వుండాలి.

ఇదేకాదు. డైరెక్టరు టెక్నీషియన్లు సెట్ మీద అరుస్తూ రిమార్క్ చెయ్యకూడదు. నటీనటుల్లో ఏదైనా తప్పు కనపడితే వెంటనే వాళ్ళని పిలిచి బోధించాలి. డైరక్టర్లకి టెక్నిషియన్లు చెప్పినట్లే చెయ్యడానికి ఆర్టిస్టు ప్రయత్నిస్తూంటాడు. ఆర్టిస్టు తీసుకునే సలహాలన్నీ కూడా, ఇతరులకి కూడా ఆ సలహాలవసరమయితేనే తప్ప, రహస్యంగా ఉండాలనే కోరిక ఆర్టిస్టులో దాగి ఉంటుంది. "అబ్బే ఇది అసహ్యంగా ఉంది"

"వాడు మాట్లాడుతున్నాడా గొణుక్కుంటున్నాడా?" "ఆ మొహాన్ని ఫొటో తియ్యడం ఎలాగండీ" అన్న రిమార్కులు ఆర్టిస్టుని నిరుత్సాహపరుస్తాయి, చనువుగా మెల్లిగా చేసిన రిమార్కులకి మంచి ఫలితం వుంటుంది. నటించడం డ్రిల్‌క్లాస్ లాంటిది కాదు.

టెక్నీషియన్లు ఆర్టిస్టుల్ని "ఇలారా – అక్కడికి వెళ్ళు కూచో నించో మెడవొంచు – "అని అలసట పెట్టకూడదు. దానివల్ల ఆర్టిస్టు తన శక్తి సామర్థ్యాల్ని చూపించలేడు. టెక్నీషియన్లు నటీనట్లు సోదరభావంతో ఐకమత్యంతో కార్యాన్ని నెరవేర్చడం భావ్యం. ఉత్తర హిందూస్థాన చిత్రాలకన్న మన చిత్రాలు ఉత్తమంగా తయారవుతున్నాయి. కథలో, సంభాషణలో, నటనలో, టెక్నిక్‌లో మన చిత్రాలదే పై చెయ్యి. ఆ సంగీతాన్ని అనుకరించడం మట్టుకు మానెయ్యాలి.

చిత్రం మీద పొగడ్తలకి నిందలకి మనం అంతా భాగస్తులమే. మనదంత ఒక సమిష్టి కుటుంబం. కుటుంబం మర్యాదకి మనమంతా బాధ్యులమే. చిత్రాన్ని సాధ్యమైనంతవరకు విజయవంతంగా తీసుకురావడం మన అందరి విధి కూడా.

Post your comments